రేవంత్‌ది నియంత పాలన

- తెలంగాణ తల్లి విగ్రహ రూపం మార్చడం హేయం
- దుబ్బాక మున్సిపాలిటీ నిధులు మళ్లించడం సిగ్గుచేటు
- బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు

దుబ్బాక, డిసెంబర్ 7: సీఎం రేవంత్ నియంత పాలన సాగిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం దుబ్బాక బీఆర్ఎస్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు టార్గెట్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తుందని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దివంగత ప్రొఫెసర్ జయశంకర్, మేధావులతో కలిసి రూపొందించారని గుర్తుచేశారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చేసి, తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు.

దుబ్బాక మున్సిపాలిటీ నిధులు మళ్లించడం సిగ్గుచేటు

దుబ్బాక మున్సిపాలిటీకి గతంలో మంజూరైన రూ.17 కోట్లు నిధులను మళ్లించడం బాధాకరమన్నారు. దుబ్బాక అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కృషి చేశారని గుర్తుచేశారు. ప్రభాకర్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో దుబ్బాకలో బస్టాండు, వంద పడకల దవాఖాన తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క రూపాయి అభివృద్ధి జరగకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. దుబ్బాకకు నిధులు కేటాయించకపోవడమే గాక, గతంలో మంజూరైన నిధులను సీఎం తన నియోజకవర్గం కొడంగల్‌కు తీసుకుపోవడం సిగ్గుచేటన్నారు. దుబ్బాకకు గతంలో మంజూరైన నిధులు వెంటనే తిరిగి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకిచ్చిన గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రభుత్వం సంబురాలు నిర్వహించడం సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రొట్టె రాజమౌళి, కౌన్సిలర్లు లలిత, శ్రీనివాస్, యాదగిరి, స్వామి, కనకయ్య, భూంరెడ్డి, బాలకిషన్ గౌడ్, రామస్వామి గౌడ్, కృష్ణ, లచ్చయ్య, ఎల్లం, రాజు, సంజీవ్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీకాంత్, పండు తదితరులున్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మృతుడి భార్యను ఓదార్చుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి, డిసెంబర్ 7: మండలంలోని తపాస్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్కాని శ్రీకాంత్ కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తపాస్‌పల్లికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశాడు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చడంతో పాటు మృతుడి కొడుకు సంజయ్‌ని ఎమ్మెల్యే పల్లా ఆప్యాయంగా హత్తుకున్నాడు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చాడు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం శ్రీకాంత్ ఇంటికి వెళ్లి రూ.20 వేలు అందజేయడంతో పాటు అండగా ఉంటానని హామీ ఇచ్చాడు. మాట ప్రకారం రెండు రోజుల క్రితం శ్రీకాంత్ వైద్యానికి రూ.8లక్షల ఎల్వోసీతో పాటు రూ.10వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నిందితులతో పాటు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

తొగుట, డిసెంబర్ 7: పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారినుంచి నగదును స్వాధీనం చేసుకున్న ఘటన తొగుట మండల పరిధిలోని గుడికందుల శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై పరుశురాములు శనివారం తెలిపిన కథనం ప్రకారం.. గుడికందుల శివారులో తొమ్మిదిమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మిరుదొడ్డి పోలీసులు కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారులో ఉన్నారు. వారి నుంచి రూ.5,715 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, ఒక ఆటో ఏడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేయాలి

దుబ్బాక, డిసెంబర్ 7: దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాకలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు, ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. దుబ్బాక చేనేతలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

పోలీస్ కమిషనరేట్‌లో ఓపెన్‌హౌస్

పోలీస్ చట్టాలు, ఆయుధాల గురించి వివరిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 7: పోలీస్ కమిషనరేట్‌లో జనవరి నుంచి ఇప్పటివరకు రికవరీ చేసిన ప్రాపర్టీ కేసులు ప్రజలకు అందించిన సేవల గురించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యార్థినీ, విద్యార్థులకు సీపీ అనురాధ అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సిద్దిపేట రూరల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు దాదాపు 1500 మంది పాల్గొన్నారు. అనంతరం సీపీ స్వయంగా ఆయుధాలు, పోలీస్ చట్టాలు, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలు, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలు, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించేలా చూడాలని ఎమ్మెల్సీకి వినతి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

గజ్వేల్, డిసెంబర్ 7: వీఆర్ఏ వారసులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించేలా కృషి చేయాలని కోరుతూ శనివారం గజ్వేల్‌లోని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డికి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన వీఆర్ఏలు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్ఏలకు జీవో 81, 85 ప్రకారం పే స్కేల్ వర్తింపజేయడంలో పాటు వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చిందని, వారు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించేలా చూడాలని కోరారు. డివిజన్ వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు నర్సయ్య, వెంకటయ్య, ఐలయ్య, భిక్షపతి, శ్రీనివాస్‌లు ఉన్నారు.

గురుకులాలు, వసతి గృహాల్లో సదుపాయాలు కరువు

మోడల్ స్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న పరశురామ్, నళినీదేవి తదితరులు

హుస్నాబాద్, డిసెంబర్ 7: రాష్ట్రంలోని గురుకులాలు, వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జి సూరంపల్లి పరశురామ్ విమర్శించారు. శనివారం గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌లోని టీఎస్ మోడల్ స్కూల్, కేజీబీవీలతో పాటు పలు హాస్టళ్లను కౌన్సిలర్ కొంకటి నళినీదేవితో కలిసి సందర్శించారు. సమస్యలను, భోజన నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాణ్యతలేని భోజనం పెడుతున్నారని, విద్యార్థులకు ఇప్పటి వరకు చలి దుస్తులు పంపిణీ చేయలేదన్నారు. గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొజ్జ హరీశ్, నాయకులు డాక్టర్ రవి, కందుకూరి సతీశ్, సదానందం, సుమన్‌నాయక్, ప్రవీణ్, వెర్సీనాయక్ పాల్గొన్నారు.

ప్రజావాణి వాయిదా

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 7: సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేసినట్లు కలెక్టర్ మనుచౌదరి ప్రకటనలో తెలిపారు. సోమవారం వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన కృషికల్ప, అగ్రిసేనరీ 2024 కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నందున ప్రజావాణిని వాయిదా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి సోమవారం ప్రజావాణికి రావాలనుకునేవారు మంగళవారం వచ్చి సమస్యల పరిష్కారానికి అర్జీలు పెట్టుకోవాలని ప్రజలకు సూచించారు.

మెప్మా సిబ్బందితో కమిషనర్ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత కుమార్

సిద్దిపేట, డిసెంబర్ 7: ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన సర్వే కోసం సిబ్బంది సెల్‌ఫోన్‌లో మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే ఎలా చేయాలి అనే అంశాన్ని ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఫోన్లో డౌన్లోడ్ చేసుకున్న యాప్‌లోనే వివరాలను నమోదు చేయాలని, యాప్‌లో దరఖాస్తుదారుడి పేరు, ఇంటి వివరాలు, రేషన్, ఆధార్ కార్డుల వివరాలు, తప్పులు లేకుండా పూరించాలని ఆదేశించారు. సోమవారం నుంచి 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం పారిశుధ్య వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించి ప్రతి ఇంటి నుంచి చెత్తను వేరు చేసి సేకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సీసీ కెమెరాల్లో గుర్తించి అవగాహన కల్పించాలన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూళిమిట్ట విద్యార్థి

ఓంకార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 7: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూళిమిట్ట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఓంకార్ ఎంపికైనట్లు హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఓంకార్‌ను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ..ఇటీవల మెదక్ జిల్లా మాసాయిపేటలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సాఫ్ట్‌బాల్ అండర్-17 పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈనెల 9న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఓంకార్ పాల్గొననున్నట్లు తెలిపారు.

నగదు బదిలీని అమలు చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్7: ప్రభుత్వం గొల్లకుర్మలకు ఇచ్చిన హామీ మేరకు జీవాల పంపిణీకి బదులుగా రూ.2లక్షల నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని గొర్రె, మేకల పెంపకందారుల సంఘం ఉపాధ్యక్షుడు ఆలేటి యాదగిరి అన్నారు. శనివారం మద్దూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ..గ్రామాల్లో జీవాలకు సరైన వ్యాక్సిన్లు పంపిణీ చేయకపోవడంతో జీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన పెంపకందారులకు ఎక్స్‌గ్రేషియ అందజేయాలన్నారు.

వాహనదారులకు జరిమానా

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 7 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు సిద్దిపేట న్యాయస్థానం శనివారం జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..ట్రాఫిక్ సర్కిల్ పరిధిలోని నర్సాపూరం, ఎంపీడీవో, చౌరస్తాలతోపాటుగా రాజీవ్ రహదారిపైన తనిఖీలు నిర్వహించామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17మంది మందుబాబులను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపర్చామన్నారు. విచారణ జరిపిన న్యాయమూర్తి వాహనదారులకు రూ.19 వేల 500 జరిమానా విధించారని చెప్పారు.

విధులు బహిష్కరించిన మున్సిపల్ కార్మికులు

కార్మికులతో మాట్లాడుతున్న రాజమౌళి

గజ్వేల్, డిసెంబర్ 7: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం ఉదయం విధులు బహిష్కరించారు. మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికుల హాజరుశాతాన్ని ఆన్‌లైన్ ద్వారా కఠినతరం చేయడంతో జీతభత్యాల విషయంలో ఇబ్బంది ఏర్పడి కార్మికులు విధులు బహిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి కార్యాలయం వద్దకు చేరుకొని వారికి నచ్చజెప్పారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించి కార్మికులతో మాట్లాడి విధుల్లో చేరే విధంగా చూశారు.

మొక్కలు నాటిన హమాలీలు

మొక్కలు నాటుతున్న హమాలీ కార్మికులు

గజ్వేల్, డిసెంబర్ 7: మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావు జన్మదినం సందర్భంగా శనివారం మండల పరిధిలోని అక్కారం గోదాంల వద్ద హమాలీ కార్మికులు, నిర్వాహకులు మొక్క నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కనాటి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెప్యాల రాజేశ్వర్‌రావు, శ్రీకాంత్, హమాలీ అధ్యక్షుడు చంద్రం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్లు

చిన్నకోడూర్ డిసెంబర్ 7: చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌వో భాస్కర్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఎర్త్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తున్నదన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. సుమారు 47 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహాచారి, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్లు మంగలంపల్లి రాజు, వెన్నెల, ఆంజనేయులు, పీఈటీ రాకేశ్, డాన్స్ మాస్టర్ రత్నం పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా.మాధవి

చేర్యాల, డిసెంబర్ 7: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆధ్య కంటి దవాఖాన సిద్దిపేట ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డా.మాధవి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పరీక్షల్లో దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు అందిస్తామని ఆధ్య దవాఖాన యాజమాన్యం ప్రకటించింది. వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్ నరేందర్, కమిషనర్ నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో రాణించాలి

జిల్లా మహిళ కబడ్డీ జట్టుతో సంతోశ్

గజ్వేల్, డిసెంబర్ 7: రాష్ట్రస్థాయిలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని మహిళా కబడ్డీ జట్టుకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ.సంతోశ్ గుప్తా అన్నారు. శనివారం 71వ రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలకు వెళ్తున్న జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు క్రీడల్లో రాణించి అందరి మనసులు గెలవాలని, అప్పుడే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. క్రీడాకారులకు ఏకరూప దుస్తులు అందజేసిన కన్నయాదవ్, రాజేశ్‌లను సన్మానించారు. కబడ్డీ క్యాంపునకు సహకరించిన డాక్టర్ వాసవాచారి, దోమకొండ సతీశ్, నేతి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, మహేశ్, సంపత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 7: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అభయ జ్యోతి మానసిక పాఠశాలలో జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ సూచనల మేరకు కళాశాలకు చెందిన 8 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కృష్ణయ్య, అధ్యాపకులు మధుసూదన్, జోజి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల సందర్శన

రిజిస్ట్రార్ శరత్‌చంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

చిన్నకోడూర్, డిసెంబర్ 7: చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర శనివారం సందర్శించారు. పాలిటెక్నిక్ కళాశాల భవనం, బాలురు, బాలికల వసతి గృహాలను పరిశీలించి పలు జాగ్రత్తలు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పరశురాములు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. కళాశాలలో అందుకున్న కోర్సుల ఆవశ్యకతను వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కళాశాలకు, విద్యాలయానికి పేరు తీసుకురావాలని సూచించారు.

'ఉపాధి' కూలీలకు వేతనాలు చెల్లించాలి

గజ్వేల్, డిసెంబర్ 7: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని పిడిచేడ్‌లో పని చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించాలని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. శనివారం గ్రామంలో చేపడుతున్న పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఆరు నెలలుగా కూలీలకు వేతనాలు అందలేదని, తక్షణమే అధికారులు వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు. కేంద్రం కూలీలకు రోజుకు రూ.300 చెల్లిస్తామని చెప్పిన మాటల్లో వాస్తవం లేదని, కూలీలకు రూ. 100 నుంచి రూ.200చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంతో మాట్లాడి ఉపాధి కూలీలకు రావాల్సిన వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కూలీలు మల్లయ్య, యాదయ్య, బుచ్చయ్య, లావణ్య పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 7: చేర్యాల మండలంలోని ముస్త్యాల హైస్కూల్‌లో 1987లో ఎస్సెస్సీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి ప్రతినెలా నిత్యావసర వస్తువులు అందజేసేందుకు ముందుకొచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు. మద్దూరు మండలంలోని సలాఖపూర్ గ్రామానికి చెందిన స్నేహితుడు నర్సింహాచారి తన తల్లితోపాటు బంధువుల తల్లికి సేవ చేస్తున్నాడు. నర్సింహాచారి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తోటి స్నేహితులు గుర్తించి అతడిని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. శనివారం చిన్ననాటి స్నేహితుడి కుటుంబాన్ని సందర్శించి రూ.2వేల విలువచేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. చంద్రారెడ్డి, వీరమల్లయ్య, శ్రీను, చంద్రశేఖర్ రెడ్డి, సత్యం, నర్సింహులు, నరహరి, పున్నం చందర్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం

సిద్దిపేట, డిసెంబర్ 7: రక్తదానం ప్రాణదానమని సిద్దిపేట మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలోని లయన్స్ భవన్‌లో మాజీ సైనిక సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి 25 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదానం చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ రమేశ్ మాట్లాడుతూ.. సమాజ సేవలో యువత ముందుభాగాన నిలువాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, మాజీ సైనికులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసులపై ఆర్థిక భారం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 7: పోలీసులకు నెల వేతనంతో అలవెన్సులు కలిపి ఇవ్వడంతో ఆదాయం పెరిగి అధికంగా ఇన్కమ్ ట్యాక్స్ కట్టాల్సి వస్తుంది.. దీంతో ఆర్థిక భారం పడుతుందని తెలంగాణ పోలీస్ ఫోరం అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీశైలం మాట్లాడుతూ..వచ్చే శాసనమండలి ఎన్నికల్లో పోలీస్, కుటుంబ సభ్యులు అందరూ ఓటు హక్కును తప్పకుండా నమోదు చేయించుకోవాలన్నారు. దీనిమూలంగా పోలీసుల సంఖ్యా బలం గణనీయంగా పెరిగి ప్రభుత్వం మన సమస్యలు వేగంగా పరిష్కరిస్తుందన్నారు. పోలీస్ ఫోరం నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన


దుద్దెడ పంచాయతీ వద్ద ఆద్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 7: కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామ పంచాయతీని సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆద్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి విద్యార్థులకు పంచాయతీ విధులు, పారిశుధ్యం, గ్రామపాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మాధవీలత, ప్రిన్సిపాల్ అనుశ్రీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు చేయూత

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 7: మహిళలు సొంత కాళ్ల మీద నిలబడి పదిమందికి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం కార్యదర్శి నాగరాణి అన్నారు. సిద్దిపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో వాసవి ఇంటర్నేషనల్ సహకారంతో శనివారం లాస్య అనే నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందజేశారు.

తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం సిగ్గుచేటు

మాట్లాడుతున్న సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఉమేశ్‌చంద్ర

చిన్నకోడూరు, డిసెంబర్ 7: అధికారంతో రేవంత్‌రెడ్డికి కండ్లు మూసుకుపోయాయని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఉమేశ్‌చంద్ర అన్నారు. శనివారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్ అధికారం ఉంది కదా అని, కండ్లు మూసుకొని పాలన చేస్తున్నారన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి, మానవ రూపంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సిగ్గుచేటు అన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని తెలంగాణ గౌరవప్రదమైన బతుకమ్మ తీసి వేయడమే కాకుండా తెలంగాణ రాచరికాన్ని సూచించే కిరీటాన్ని తొలగించడం, కాంగ్రెస్ గుర్తును సూచించే విధంగా కేవలం హస్తం మాత్రమే ఉంచడం హేయమైన చర్య అన్నారు. వేములవాడ క్షేత్రంలో ఉన్న కోడెలను దేవాదాయ శాఖ మంత్రి సాయంతో వరంగల్‌కు చెందిన వ్యక్తి కొండా సురేఖ అనుచరుడు గోశాల పేరుతో 60 కోడెలను తీసుకుపోయి కోతకు అమ్ముకుంటే, తూతూమంత్రంగా కేసు నమోదు చేశారని మండిపడ్డారు. ఆలయ ఈవోపైన మంత్రి కొండా సురేఖపైన ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కోడెలు విషయం తెలిసినా బీజేపీ నిమ్మకునీరెత్తనట్లుగా ఉండడం కాంగ్రెస్, బీజేపీలు చీకటి ఒప్పందంలో ఉన్నాయని తేటతెల్లం అయిందన్నారు. సమావేశంలో మన్నె ఆనంద్, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, తీగుల్ల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు

వర్గల్: లక్ష పుష్పార్చన చేస్తున్న పండితులు

వర్గల్, డిసెంబర్ 7: వర్గల్ శ్రీవిద్యాధరి సరస్వతీమాత ఆలయంలోని ఉప దేవాలయమైన శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం షష్ఠి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పండితులు తెల్లావారుజామున ఉత్సవానికి అంకురార్పణ చేశారు. స్వామివారికి విశేష అభిషేకం, లక్ష పుష్పార్చన అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. షష్ఠి సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

చేర్యాల, డిసెంబర్ 7: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు శకుంతలఆంజనేయుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అర్చకుల వేదమంత్రోచ్చారణ నడుమ అమ్మవార్లకి మాంగళ్యధారణ చేసి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం స్వామికి పట్టాభిషేకం నిర్వహించి నగర సంకీర్తన చేశారు. అంతకుముందు మూలవిరాట్లకు పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న సిద్దిపేట పద్మనాయక వెలమ సంక్షేమ సమితి సభ్యులు

- సిద్దిపేట వెలమ సంక్షేమ సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 7: బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఒక సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిద్దిపేట పద్మనాయక వెలమ సంక్షేమ సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. శనివారం సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెలమ సామాజిక వర్గాన్ని దూషిస్తూ అంతు చూస్తానని బెదిరించడం సరైన చర్య కాదన్నారు. ఆయన వాడిన భాష వల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంపత్‌రావు, సంతోష్‌రావు, రామారావు, గోపాల్‌రావు, జ్యోతి, కిషన్‌రావు, నర్సింగరావు, సభ్యులు చందర్‌రావు, మాణిక్యరావు పాల్గొన్నారు.